నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
4 | హైదరాబాద్, శనివారం 20 జూలై 2024 | RANGAREDDY

పరిగిలోని ఎస్‌బీఐ ఏడీబీ వద్ద జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న రైతులు

లిస్టులో తమ పేర్లు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పలువురు రైతులు

అన్నదాతలతో కిటకిటలాడిన బ్యాంకులు

నా పేరుందా!

రుణమాఫీ జాబితాపై అన్నదాతల ఆరా

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు పంట రుణాలను మాఫీ చేసినట్లుగా ప్రకటించగా సదరు జాబితాలో తమ పేరు ఉందో, లేదో తెలియక పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే రుణ మాఫీ జాబితా అంటూ పలు గ్రామాల్లోని సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న లిస్టుల్లో తమ పేర్లు లేకపోవడంతో పలువురు అన్నదాతలు శుక్రవారం బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పరుగులు పెట్టారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పలు బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు కిటకిటలాడాయి. అక్కడున్న లిస్టులను పరిశీలించిన చాలామంది రైతులు.. తీరా తమ పేర్లు లేకపోవడంతో అసంతృప్తితో వెనుదిరిగారు. గతంలో చెప్పిన జాబితాకు ప్రస్తుతం రుణ మాఫీ జరిగిన వారి వివరాలకు పొంతన లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

–రంగారెడ్డి, జూలై 19(నమస్తే తెలంగాణ)

'నందిగామ మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నవారు 33 మంది ఉండగా..12 మందికి మాత్రమే రుణమాఫీ అయింది.'

'ఇదే మండలం చేగూరు పీఏసీఎస్‌లో రూ.లక్షలోపు రుణాలను 264 మంది తీసుకోగా. .అందులో 156 మందికి మాత్రమే రుణమాఫీ అయింది.'

ఇలా.. చెప్పుకుంటూ పోతే రుణ విముక్తి జరగని రైతుల సంఖ్య ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున్నే ఉన్నది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. లక్షలోపు రుణ విముక్తి కలగని రైతులు భారీ సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ సర్కార్ గురువారం రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించగా జాబితాలో పేర్లు రాని అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రైతులు బ్యాంకులు, అధికారుల వద్దకు వెళ్లి జాబితాలో పేరు ఉందో! లేదో? అని తెలుసుకోవడం కనిపించింది. జాబితాలో పేర్లు లేని రైతులు.. ఎందుకు రాలేదంటూ.. అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కారణాలు తెలియవు..

రూ.లక్ష వరకు రైతుల రుణాలు మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నా.. వాస్తవానికి మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్ల రుణ మాఫీ చేసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నా.. అర్హులైన రైతుల పేర్లు సైతం లిస్టులో రాలేదు. చాలా మంది రైతుల పేర్లు జాబితాలో గల్లంతవడంతో వారు లబోదిబోమంటున్నారు. అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ వర్తింపజేయకపోవడంతో ప్రభుత్వంపై మండి పడుతున్నారు. బయటికి పాస్‌బుక్‌ల ప్రామాణికంగా.. రుణ మాఫీ చేశామని చెబుతున్న ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని, పీఎం కిసాన్ యోజన నిబంధనలకు అనుగుణంగా రైతులకు రుణమాఫీ చేసిందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పీఏసీఎస్, రైతు సేవా సహకార సంఘాల్లో వందలాది మంది అర్హులైన రైతులు ఉన్నప్పటికీ.. రుణమాఫీ కాకపోవడం విస్తుగొలుపుతున్నది. మొత్తంగా ఉమ్మడి జిలావ్యాప్తంగా రుణమాఫీ అమలులో గందరగోళం నెలకొన్నది. రుణమాఫీ కాకపోవడానికి కారణాలను తెలుసుకునేందుకు శుక్రవారం రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పరుగులు పెట్టారు. దీంతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. ఇటు ప్రభుత్వ తీరు.. అటు రైతులకు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తున్నది. మాఫీ కాకపోవడానికి గల కారణాలను రైతులకు ఎవరూ చెప్పలేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో అధికారులు రైతులకు ఏవో కారణాలు చెప్పి పంపిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచే జాబితాలు వచ్చాయని, ఈ విషయంలో తమకేమీ తెలియదని అధికారులు రైతులకు చెప్పడం గమనార్హం. అంతేకాకుండా రెండో జాబితా వస్తుందని కొంతమంది అధికారులు సర్దిచెప్పడం కనిపించింది. మొదటి విడత పరిస్థితే ఇలా ఉంటే.. ఇక రెండో విడత, మూడో విడత పరిస్థితి ఎలా ఉంటుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీ జరగని వాటిలో మచ్చుకు కొన్ని..

- **నందిగామ మండలం మేకగూడ పీఏసీఎస్ పరిధిలో 306 మంది రైతులు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నారు. కానీ.. వీరిలో 181 మంది రైతులకే రుణమాఫీ అయ్యింది.**
- **షాద్‌నగర్ పీఏసీఎస్ పరిధిలో 313 మందికి రూ.లక్ష లోపు రుణమాఫీ వర్తించాల్సి ఉండగా.. కేవలం 174 మంది రైతుల పేర్లే జాబితాలో ఉన్నాయి.**
- **కొందుర్గు పీఏసీఎస్ పరిధిలో 1,005 మందికి రూ.లక్ష రుణమాఫీ కావాల్సి ఉంది. అయితే 372 మందికే రుణమాఫీ జరిగినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.**
- **కేశంపేట మండలం కొత్తపేట పీఏసీఎస్ పరిధిలో రూ.లక్ష రుణమాఫీకి 470 మంది అర్హులుకాగా.. తొలి జాబితాలో 236 మందికే మాఫీ అయ్యింది.**

శంకర్‌పల్లిలో యూనియన్ బ్యాంక్‌లో రైతుల రద్దీ

ప్రభుత్వం మోసం చేస్తున్నది..

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. రుణమాఫీ గందరగోళంగా ఉన్న ది. నేను కడ్తాల్‌లో ఉన్న కెనరా బ్యాంకులో రూ.40 వేలు రుణం తీసుకున్నా. అయినా జాబితాలో నా పేరు రాలేదు. బ్యాంకులో తీసుకున్న అప్పులకు ఏ లెక్కన డబ్బులు చెల్లిస్తున్నారో తెలియడం లేదు. కొందరికే మాఫీ చేసి మిగతా వారికి మాఫీ చేయకపోవడం సబబు కాదు.

- కంబాల ఈశ్వర్, కడ్తాల్ మండలం

నాతోపాటు చాలా మందికి మాఫీ కాలేదు..

రూ. లక్ష లోపు తీసుకున్న వారి రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిం ది. తీరా చూస్తే ఆ జాబితాలో నా పేరే లేదు. రూ.75 వేలు చేవెళ్ల మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్‌లో పంట రుణంగా తీసుకున్నా. లక్ష లోపు మాఫీ అన్నప్పుడు నా రుణం కూడా మాఫీ కావాలి కదా..? నాతోపాటు చాలా మంది పరిస్థితి ఇలాగే ఉన్నది. అధికారులను అడిగితే రెండో జాబితాలో వస్తుం దోమోనని చెబుతున్నారు.

- రైతు (మాజీ సర్పంచ్) శ్యామలయ్య, దేవునిఎర్రవల్లి, చేవెళ్లటౌన్

రుణమాఫీ కొందరికేనా..?

కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష లోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి కొందరికే మాఫీ చేయడం తగదు. నేను లక్షలోపు పంట రుణంగా తీసుకుని అర్హుడిగా ఉన్నా.. నా పేరు జాబితాలో రాలేదు. వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకు వారిని అడిగితే సమాధానం చెప్పడం లేదు. రుణాలు మాఫీ కాని రైతులు ఎవరిని కలవాలో అర్థం కావడంలేదు.

-బింగారం పెంటయ్య, రైతు, తెలంగాణ ఉద్యమకారుడు

అంతా గందరగోళ ంగా..

నేను తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నా. అది దాదాపుగా రూ.లక్ష వరకు ఉంటుంది. కానీ.. నా పేరు మాత్రం ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో రాలేదు. ఇదే పరిస్థితి మా గ్రామంలో చాలామందికి ఎదురైంది. అంతా గందరగోళంగా ఉన్నది. అర్హులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

- అలిగేరి బాలమణి, గంజిపల్లి, దోమ

నత్తనడకన.. స్పెషల్ డ్రైవ్

పెండింగ్‌లో 13,400 ధరణి దరఖాస్తులు

రిపోర్టులు ఇవ్వడంలో తహసీల్దార్ల చేతివాటం

డబ్బు లిస్తేనే సరైనవి.. లేకపోతే అంతే సంగతులు

రిపోర్టుల ఆధారంగా ధరణి దరఖాస్తులకు మోక్షం

ఆర్ఎస్ఆర్ సమస్యల పరిష్కారానికీ తప్పని తిప్పలు

వికారాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధరణి స్పెషల్ డ్రైవ్ నత్తనడకన సాగుతున్నది. రోజురోజుకూ ధరణి దరఖాస్తుల సంఖ్య పెరుగుతున్నా.. పరిష్కారం మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నది. జిల్లావ్యాప్తంగా గత నెలలో 10 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుతం మరిన్ని పెరిగాయి. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పరిష్కరించే దరఖాస్తుల్లో 60 శాతానికిపైగా తిరస్కరిస్తుండడంతో రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో దరఖాస్తుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 13,400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో అధికంగా టీఎం-33(డేటా కరెక్షన్) దరఖాస్తులే పెండింగ్‌లో ఉన్నాయి. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గత ఇరవై రోజుల్లో దాదాపు 3500 దరఖాస్తులను రెవెన్యూ యంత్రాంగం పరిష్కరించింది. వీటిలో అత్యధికంగా తిరస్కరించిన దరఖాస్తులే ఉన్నాయి. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిల్లో దరఖాస్తుల్లో పరిష్కారం త్వరగా పూర్తి అవుతున్నప్పటికీ కలెక్టర్ స్థాయిలో ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో రైతులు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో విన్నవించడంతోపాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. టీఎం-33 అనంతరం ఆర్ఎస్ఆర్, మ్యుటేషన్, సక్సెషన్ తదితర మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పరిష్కరించే వీలులేకపోవడంతో సంబంధిత దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. అయితే ఆర్ఎస్ఆర్ సమస్య పరిష్కారానికి ఎలాంటి ఆప్షన్ లేకపోవడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రతి గ్రామంలోనూ ఆర్ఎస్ఆర్ సమస్య ఉండడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.

మందకొడిగా..

జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం మందకొడిగా సాగుతున్నది. గత నెలతో పోలిస్తే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య మరింత పెరగడం గమనార్హం. ఎక్కువ రోజులుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మొదట పరిష్కరించేందుకు నిర్ణయించిన కలెక్టర్ ప్రతీక్ జైన్.. అందుకు అనుగుణంగా తహసీల్దార్ల నుంచి రిపోర్టులు తెప్పించుకుంటున్నారు. అయితే భూ బాధితులతో సంబంధం లేకుండా రిపోర్టులను పంపించాలని ఆదేశాలు రావడంతో చాలావరకు ఆయా మండలాల తహసీల్దార్లు అన్ని సరిగ్గా ఉన్నా ఏదో ఒక కొర్రీలు పెడుతూ రిజెక్టు చేసేలా రిపోర్టులు పంపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆయా మండలాల్లో ధరణి ఆపరేటర్లతో రిపోర్టులు రెడీ చేస్తున్న రైతుల వివరాలు తెలుసుకొని బేరసారాలకు దిగుతూ రిపోర్టులు పంపుతున్నట్లు తహసీల్దార్ కార్యాలయాల వద్ద జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ డబ్బులు ఇవ్వనట్లయితే తప్పుడు రిపోర్టులు పంపుతూ చేతులు దులుపుకొంటున్నట్లు వినిపిస్తున్నది. పలు మండలాల తహసీల్దార్లు చేస్తున్న భూదందాపై కలెక్టర్ దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్ రిపోర్టు తప్పనిసరి కావడంతో ఇదే అదునుగా చేసుకొని జిల్లాలోని కొందరు తహసీల్దార్లు కింది స్థాయి సిబ్బందితో కుమ్మక్కై జోరుగా వసూలకు పాల్పడుతున్నారనే వాదనలున్నాయి. జీఎల్ఎం మాడ్యుల్(గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్) దరఖాస్తులు తహసీల్దార్ల స్థాయిలోనే పూర్తి అవుతుండడంతో బాధితుల నుంచి వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. తహసీల్దార్లు డబ్బులు ఆశించకుండా పారదర్శకంగా రిపోర్టులను పంపితేనే ధరణి దరఖాస్తుల పరిష్కారం వేగవంతమవుతుందని, ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్షేత్రస్థాయి భూ సర్వేతోనే ఆర్ఎస్ఆర్‌కు పరిష్కారం...

జిల్లాలో ప్రధానంగా టీఎం-33 అనంతరం ఆర్ఎస్ఆర్ సమస్యతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు ఉన్న భూమి కంటే ఎక్కువ లేదా తక్కువ భూమి ఉన్నట్లు ధరణి ఆపరేటర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతో ఆర్ఎస్ఆర్ సమస్య పరిష్కారం కోసం కూడా రైతులు తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాత రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లో ఏ రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలను తెలుసుకొని ఆర్ఎస్ఆర్ సమస్యను పరిష్కరించవచ్చు. కానీ రికార్డుల్లో కూడా తప్పుగా ఎంట్రీ కావడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. అంతేకాకుండా ఏదేని రైతుల పేరిట ఎక్కువ భూమి ఉన్నట్లు ధరణిలో ఎంట్రీ కావడంతో గుర్తించడం పెద్ద కష్టంగా మారడంతోపాటు సంబంధిత రైతులు సహకరించకపోవడంతో కూడా ఆర్ఎస్ఆర్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అయితే ఆర్ఎస్ఆర్ సమస్య పరిష్కారానికిగాను ధరణి పోర్టల్‌లో ఆప్షన్ ఇచ్చినా.. కేవలం 10 శాతం మాత్రమే పరిష్కరించేందుకు వీలుందని రెవెన్యూ యంత్రాంగం నుంచి అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆర్ఎస్ఆర్ సమస్యను పూర్తిగా పరిష్కరించాలంటే క్షేత్రస్థాయి భూసర్వే తప్పనిసరిగా చేయాలనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

మీర్‌పేట బీఆర్ఎస్‌దే

కాంగ్రెస్, బీజేపీలకు చుక్కెదురు

రెండు సార్లు అవిశ్వాసం పెట్టి బొక్కబోర్లపడ్డ వైనం..

మీర్‌పేటలో అవిశ్వాసం నెగ్గుతామని తోక ముడిచిన కాంగ్రెస్, బీజేపీలు

కుట్రలను తిప్పికొట్టిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కోరం లేకపోవడంతో డిప్యూటీ మేయర్ పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

కోరం లేక మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌పై పెట్టిన అవిశ్వాసం వీగి పోయిందని ప్రకటిస్తున్న ప్రిసైడింగ్ అధికారి సూరజ్ కుమార్

బడంగ్‌పేట, జూలై 19: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెట్టి పై చేయి సాధించాలన్న జాతీయ పార్టీలకు చుక్కెదురైంది. ఒకసారి మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్‌పై అవిశ్వాసం పెట్టి నెగ్గలేక పోయారు. మరోసారి శుక్రవారం డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి పై అవిశ్వాస తీర్మానం పెట్టి పంతం నెగ్గించుకోవాలనుకున్నారు. చివరకు రెండు జాతీయ పార్టీలు బొక్క బోర్ల పడ్డాయి. డిప్యూటీ మేయర్ పై పెట్టిన అవిశ్వాసం నెగ్గాలని కాంగ్రెస్, బీజేపీలు సకల ప్రయత్నాలు చేశాయి. అవిశ్వాసం నెగ్గుతామని తొడలు కొట్టి తోక ముడిచారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 46 మంది కార్పొరేటర్లు ఉన్నారు. 31 మంది కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చారు. కలెక్టర్ పరిశీలించి 15 రోజుల సమయం ఇచ్చి శుక్రవారం ఉదయం 11గంటలకు అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం 11గంటలకు అవిశ్వాసం పెట్టారు. 11.30 గంటల వరకు కార్పొరేటర్లు ఎవరూ కూడా సమావేశం హాలులోకి రాలేదని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి తెలిపారు. 11.30 నుంచి 12.30 గంటలకు మరోసారి సమయం ఇచ్చారు. 12 గంటల తర్వాత కాంగ్రెస్ కార్పొరేటర్లు ఏడుగురు, చివరి 15నిమిషాల్లో బీజేపీ కార్పొరేటర్లు 19 మంది హాజరయ్యారు. 31 మంది కార్పొరేటర్లు హాజరు కావాల్సి ఉండగా 26 మంది సభ్యులు సమావేశానికి వచ్చారు. కోరం లేని కారణంగా సమావేశం నిర్వహించలేదు. కోరం లేని కారణంగా డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి సూరజ్ కుమార్ ప్రకటించారు. అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ..

రెండు జాతీయ పార్టీలు ఢిల్లీలో కుస్తీ పడుతూ.. గల్లీలో దోస్తీ చేస్తున్నారు. ఆ పార్టీల వెనుకాల పెద్ద నాయకులు ఈ అవిశ్వాసం కథను నడిపించినట్లు తెలుస్తోంది. మహేశ్వరం నియోజకవర్గంలో ప్రత్యక్ష ఎన్నికల్లో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని ఎదుర్కోవడం సాధ్యం కాలేదని ఈ రెండు పార్టీలు నిర్ణయించుకున్నాయి. అవిశ్వాసంలోనైనా తమ పంతం నెగ్గించుకోవాలని ఆ రెండు పార్టీల నాయకులు ఒక్కటయ్యారు. మేయర్ దుర్గా పై అవిశ్వాసం పెట్టి విఫలమయ్యామని, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి పై ఎలాగైనా పట్టు సాధించాలని సకల ప్రయత్నం చేసి చివరికి చతికిల పడ్డారు. రెండు జాతీయ పార్టీలు చేసిన కుట్రలు ఫలించలేదు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి చక్రం తిప్పడంతో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అవిశ్వాసంలో పై చేయి సాధించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీని కదిలించలేరని తేలిపోయింది.

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఉండగా ఎవరి ఆటలు సాగవు..

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో తన పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడానికి అన్ని విధాలుగా రాజకీయ చతురతను ఉపయోగించి తనను గట్టెక్కించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి, సహకరించిన కార్పొరేటర్లకు కృతజ్ఞతలు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అండగా ఉన్నంత కాలం ఎవరి కుట్రలు చెల్లవు. నా పనితీరు నచ్చి గతంలో డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. మరోసారి కొంత మంది కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి నా వెంట ఉండి సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లకు ఎప్పుడు రుణపడి ఉంటా. అధికార దాహంతో కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు పన్ని నన్ను డిప్యూటీ మేయర్ పదవి నుంచి తప్పించాలని ప్రయత్నం చేశారు. నాపై ఉన్న నమ్మకంతో అండగా నిల్చి మరోసారి అవకాశం కల్పించి మరింత బాధ్యత పెంచారు. తప్పకుండా నా వంతు బాధ్యతగా అభివృద్ధికి కృషి చేస్తా. ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సారథ్యంలో మాత్రమే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ప్రజలు సబితా ఇంద్రారెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. సహకరించిన వారందరికి కృతజ్ఞతలు. **- తీగల విక్రమ్ రెడ్డి, డిప్యూటీ మేయర్**